కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, జూలై 28 : కష్టసుఖాల్లో కార్యకర్తలను కంటి రెప్పలా కాపాడుకుంటానని, పార్టీ ప్రతిష్టకు మరింత కృషి చేస్తానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం రేగొండ మండల కేంద్రంలో చిట్యాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని రెండు వర్గాలుగా చేసి, పార్టీ బలహీన పడి, ఓడిపోయేలా కొందరు చేశారన్నారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గంలో ఎవరి జోక్యం ఉండదని కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిదని, 8 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో వెనుకపడిపోయిందన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమం అనంతరమే కాంగ్రెస్ ప్రభుత్వం సాగు నీటి విడుదల చేసిందన్నారు. పరకాల, భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రాల్లో వారంలో 3 రోజులు ఉంటాన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై ప్రతిపక్ష నేతగా పోరాటం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గొర్రె సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మోడువారిన భారీ వృక్షాలు

మహదేవపూర్: ప్రమాదకరంగా వృక్షం

మహదేవపూర్, జూలై 28 : మండల కేంద్రంలోని బొమ్మాపూర్ మలుపు వద్ద, బృహత్ పల్లెప్రకృతి వనం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఎండిన మోడువారిన భారీ వృక్షాలు ప్రమాదకరంగా ఉ న్నాయి. ఇటీవల దీనిపై 'మోడు వారిన వృక్షాలు ఇలా.. ప్రమాదం జరిగితే ఎలా' అనే శీర్షికతో 'నమస్తే తెలం గాణ'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో సంబంధిత అధికారులు హడావుడి చేసి, చేతులు దులుపుకున్నారు. ఇదిలా ఉంటే వర్షం కార ణంగా ఇటీవల ఓ ఎండిన భారీ వృక్షం తడిసి ముద్దయి, ఈదురు గాలులతో కొమ్మలు విరిగి రహదారిపై పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరుగలేదు. కాగా, మిగతా వృక్షాలు కూడా రహదారిపై వంగి ఉండడంతో ప్రజలు, వాహనదాలు భయాందోనళకు గురవుతున్నారు. ప్రమా దం జరగక ముందే అధికారులు స్పందిం చి వృక్షాలను తొలగించాలని కోరుతున్నారు.

ప్రమాదకర చెట్లు కూల్చివేత

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునా గారం వరకు గల జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న చెట్లను ఆదివారం తొలగించారు. పలు చోట్ల చెట్లు కిందికి ఉండడంతో అవి ఎప్పుడు రోడ్డుపై పడతాయో తెలియని పరిస్థితి నెల కొంది. రెండు రోజుల క్రితం చెట్టు కూలి పడడంతో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. మరిన్ని చెట్లు పడే అవకాశం ఉండడంతో వాటిని తొలగించారు. బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు వహీద్, జాతీయ హక్కుల కమిషన్ సభ్యుడు శివకుమార్ పాల్గొన్నారు.

జేసీబీతో కూల్చివేస్తున్న చెట్లు

ఉద్యమకారుల హామీలపై ప్రకటన చేయాలి

మల్హర్, జూలై 28 : ఉద్యమ కారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు.. ఆదివారం మండల కేంద్రం తాడిచర్లలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారుల గుర్తింపు, 250 గజాల ఇంటి స్థలం, ఫించన్, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిని రాజయ్య యాదవ్, మండల అధ్యక్షుడు ముడితనపెల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బూడిద సతీశ్, ఉపాధ్యక్షులు చొప్పరి రాజు, జిల్లా అధ్యక్షురాలు గడ్డం సమ్మక్క, టీయూఎఫ్ రాష్ట్ర నాయకురాలు దుబాసి పార్వతి, నాయకులు జునగరి పద్మ, గుంటుకు వసంత, షేక్ చాంద్ పాషా, మీనుగు నాగయ్య, కోట నవీన్, బండారి శంకరయ్య, ఊట్నూరి రమేశ్ పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

కృష్ణ కాలనీ : తెలంగాణ ఉద్యమకారులకు జిల్లా కేంద్రంలో 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదండ్ల రాజ గట్టయ్య యాదవ్ డిమాండ్ చేశారు. టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహానికి ఉద్యమకారులతో కలిసి మెమోరాండం అందజేశారు. నాయకులు రాజేశ్వరి, మెండు వాని, శారద, నజియా బేగం, శంకర్, సాంబలక్ష్మి, పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

WANTED
jobs Apply Now!
★Wanted PRO's for MBBS in Abroad Education. Please Contact Phone No. 8121554649.
NTW-314856

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

వాజేడు : వరదనీటిలో ఈత కొడుతున్న పర్యాటకులు

వెంకటాపురం(నూగూరు) : గడి చెరువు జలపాతం వద్ద పర్యాటకులు

జలపాతాల వద్ద పర్యాటకుల సందడి

బొగతలో పోలీసుల పహారా

వాజేడు, జూలై 28 : వరద ఉధృతి కారణంగా నాలుగు రోజులుగా నిలిపివేసిన బొగత జలపాతం సందర్శన ఆదివారం తిరిగి ప్రారంభించారు. జలపాతం సందర్శనకు అనుమతి ఇవ్వడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జలపాతం ముందుభాగం, ఈతకొలను చుట్టూ అటవీశాఖ, బొగత సిబ్బంది, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఎంట్రీగేటు వద్ద ఎఫ్ఆర్వో చంద్రమౌళి పర్యవేక్షణలో వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. కాగా, మండలంలోని కోప్పుసూరు అటవీప్రాంతంలో ఉన్న గుండ్లవాగు ప్రాజెక్టులోకి వరద చేరడంతో మత్తడిపోస్తోంది. పర్యాటకులు తరలివచ్చి మత్తడి అందాలను తిలకించి, వరదనీటిలో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.

జగన్నాథపురం శివారులో పహారాకాస్తున్న సిబ్బంది

ఆ రెండు జలపాతలకు నిషేధాజ్ఞలు

మండలంలోని కొంగాల విఫాల్స్(దూసపాటిలొద్ది) జలపాతంతోపాటు అరుణాచలపురం గుండం జలపాతాలకు పర్యటకులను వెళ్లకుండా చేపట్టిన నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. కొంగాల క్రాస్‌రోడ్డు, అరుణాచలపురం గ్రామం వద్ద పర్యాటకులు వెళ్లకుండ అటవీశాఖ అధికారులు పహారా కాస్తున్నారు.

గడి చెరువుకు పర్యాటకుల సందడి

వెంకటాపురం(నూగూరు) : మండల పరిధి మహితాపురం గ్రామ సమీపంలోని గడి చెరువు జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జలపాతాలకు జలకళ సంతరించుకోవడంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. జలపాతాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు.

వాజేడు : జలపాతం వద్ద పోలీసులు

అమరవీరుల త్యాగాలు యువతకు స్ఫూర్తి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

కృష్ణ కాలనీ, జూలై 28 : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, దేశానికి సేవలు అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని భారత అమర జవాను స్థూపం వద్ద మాజీ సైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివాస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్తూపం వద్ద పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్గిల్ యు ద్ధంలో మన సైనికులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెతోజ్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌సీసీ జూనియర్ డివిజన్ ప్రారంభించాలని, మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. అలాగే, యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్, మాజీ సైనికులు అభిషేక్ గుప్త, సత్యనారాయణ స్వామి, రవికుమార్, సురేశ్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

వంతెన పనులు పరిశీలన

టేకుమట్ల : టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య జరుగుతున్న వంతెన పునర్మిర్మాణ పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు మండలంలోని రామకృష్ణపూర్(వి)లో పీరీ ల పండుగ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేతోపాటు సతీశ్‌గౌడ్‌ను ముస్లింలు సన్మానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు నాంపెల్లి వీరేశం, కత్తి సంపత్, చిరంజీవి, వంగ నరేశ్, ఎలబోయిన రాజేందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ఆర్అండ్‌బీ అధికారులు

'నమస్తే' ఎఫెక్ట్

వాజేడు, జూలై 28 : వర్షాలతో రోడ్లపై గుంతలు ఏర్పడి వరుసగా ప్రమాదాలు జరుగుతుండడంతో ఆర్అండ్‌బీ అధికారులు ఆదివారం ఆ గుంతలను పూడ్చారు. రోడ్ల దుస్థితిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 27, 28 తేదీల్లో వరుసగా కథనాలు వెలువడ్డాయి. దీనికి స్పందించిన అధికారులు వెంటనే దెబ్బతిన్న రహదారుల గుంతలను ఆదివారం పూడ్చారు. మండలంలోని అల్లివాగు బ్రిడ్జి వద్ద, ప్రగళ్లపల్లి గ్రామ శివారుతో పాటు పలుచోట్ల గుంతలను పుడ్చడంతో వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించారు.

ప్రగళ్లపల్లి గ్రామశివారులో గుంతలో చిప్స్‌పోసి మరమ్మతు చేపట్టిన అధికారులు

గీత కార్మికుడికి గాయాలు

గణపురం, జూలై 28 : మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గడ్డమీది సమ్మయ్య ఆదివారం తాటి చెట్టు మీది నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వృత్తిలో భాగంగా సమ్మయ్య గ్రామంలో తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లకు ఉన్న గుయ్యి జారింది. దీంతో చెట్టు పైనుంచి పడగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వెంటనే స్థానిక దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని వైద్యశాలకు తరలించారు. సమ్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

గూడు చెదిరింది.. కన్నీరు మిగిలింది

ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మహదేవపూర్,జూలై 28 : మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆదివారం మండలపరిధిలోని కుదురుపల్లిలో పేద కుటుంబానికి చెందిన గోగుల తిరుపతి ఇంటి గోడలు వ ర్షానికి కూలిపోయాయి. అయితే, గోడలు బయట వైపు కూలడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. భార్య, ఇద్ద రు కుమార్తెలు, తల్లితో కలిసి నివసిస్తున్న తిరుపతి గూడు కూలి నిరాశ్రయుడు కావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. కూలి చేస్తేనే పూట గడవని బాధిత కు టుంబ సభ్యులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

వరద బాధితులకు సరుకులు పంపిణీ

వాజేడు/వెంకటాపురం(నూగూరు), జూలై 28 : గోదావరి వరదల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న వాజేడు మండలంలోని ఎడ్జర్లపల్లి పంచాయతీ పరిధి ఒమ్మనపల్లి గ్రామస్తులకు ఆదివారం వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై రుద్రరాపు హరీశ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కాగా, ఆపద సమయంలో అండగా ఉంటున్న పోలీసులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆదినారాయ ణ, చిటమ ట శేఖర్, నర్సింహరావు, సత్యనారాయణ పా ల్గొన్నారు. అలాగే, వెంకటాపురం నూగూరు మండలంలోని పాత్రాపురం పంచాయతీ పరిధి లక్ష్మీపురంలో గ్రామస్తులకు కూడా పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వెంకటాపురం(నూగూరు) : నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సీఐ బండారి కుమార్

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

మహదేవపూర్ : గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

మహదేవపూర్,జూలై 28 : ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలని డీఆర్వో రాజేశ్వర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీ లో పూలు, పండ్ల మొక్కలను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. సెక్షన్ అధికారి మగ్బూల్, బీట్ అధికారులు సంజీవ్, రమేశ్, మోనా, అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు రఘురాజ్ సింగ్, మెరుగు వెంకటయ్య, అంకన్న పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో..

మహాముత్తారం/కాటారం : మహాముత్తారం మండలంలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో అటవీ క్షేత్ర అధికారి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు డీఆర్వో రమేశ్, హుస్సేన్, ఎఫ్ఎస్‌వో రమేశ్, సంతోష్, రెహమాన్, బీట్ ఆఫీసర్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, అజంనగర్ రేంజ్ పరిధిలోని మహాముత్తారం కస్తూర్బా బాలికల పాఠశాలలో అటవీ క్షేత్ర అధికారి సత్యానారాయణ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. సెక్షన్ అధికారులు సాంబయ్య, రజిత, బీట్ అధికారులు మంజుల, పత్తిబాబు, బేస్ క్యాంప్ సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు చైతన్య, వనిత పాల్గొన్నారు. కాటారంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో అటవీ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలను నాటారు. కాటారం ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్ఎస్‌వోలు సుమన్, అర్చన, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాజేడులో తగ్గుతున్న గోదావరి

వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యలోని రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు

వాజేడు జూలై 28 : మండలంలో కొన్నిరోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య రహదారిపై వరదనీరు పూర్తిస్థాయిలో తొలగకపోవడంతో రాకపోకలు కొనసాగడం లేదు. టేకులగూడెం 163 జాతీయ రహదారిపై రేగుమాగు వద్ద సైతం వరదనీరు కొంతమేర తగ్గి ప్రవహిస్తోంది. సోమవారం ఉదయంలోపు జాతీయ రహదారిపై పూర్తిస్థాయిలో వరదనీరు తగ్గుతుందని గ్రామస్తులు భావిస్తున్నారు. మండలంలోని ఇసుకవాగు సమీపంలో గోదావరి వరదను చూసేందుకు చీకుపల్లి, పెద్దగొల్లగూడెం గ్రామల ప్రజలు వస్తున్నారు. కాగా, పేరూరు వద్ద గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టినట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

శిథిలావస్థ ఇండ్లను ఖాళీ చేయాలి

ములుగురూరల్, జూలై28 : వర్షాల నేపథ్యంలో ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ఖాళీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం తెలిపారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు స్వచ్ఛందంగా ఇండ్లను ఖాళీ చేసి అధికారులకు సహకరించాలన్నారు. లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేయాలని సూచించారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

ములుగురూరల్, జూలై 28 : ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను హైదరాబాద్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఆదివాసీ ఏజెన్సీ పరిధిలోని ట్రైబల్ అడ్వైజరీ కమిటీ నియమిస్తూ జీవో 3ను పునరుద్ధరించాలని కోరారు. తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, గంట సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురం ప్రభాకర్, అడ్వైజర్ పొడుగు శ్రీనాథ్, నాయకులు సోయం చిన్నయ్య, కోటె రవి, ఐలబోయిన వీరయ్య, శ్రీనివాస్, మంకిడి రవి, వజ్జ రాజు, రవికాంత్, మహేశ్, జంగుదేవ్‌పటేల్,ప్రభాకర్, వెంకన్న, పాపారావు ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ములుగురూరల్, జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, పట్టా పాస్ బుక్‌తో సంబంధం లేకుండా క్రాప్ లోన్ ఉన్న రైతుకు సైతం మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ గఫూర్‌పాష అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కమిటీ సభ్యుడు రత్నం ప్రవీణ్, దేవేందర్, సద్దాం హుస్సేన్, కలువల రవీందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి

ములుగురూరల్, జూలై 28 : ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రభుత్వ దవాఖాన పిడియాట్రిషన్ డాక్టర్ రాజా, జనరల్ సివిల్ డాక్టర్ వినయ్ సూచించారు. ఆదివారం ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దవాఖాన శానిటరీ సిబ్బంది, రోగులకు హైపటైటిస్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేర్గు రమేశ్, కార్యదర్శి చుంచు రమేశ్, కోశాధికారి సానికొమ్ము రవీందర్‌రెడ్డి, కొండి సాంబశివ, దొంతిరెడ్డి బలరాంరెడ్డి, ఇప్పకాయల ఉదయ్, కొట్టె రాజిరెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను మెరుగుపరచాలి

మంగపేట, జూలై 28 :మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి వైద్య ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాదగిరి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మూడు పీహెచ్‌సీల్లో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యులు స్థానికంగా ఉండకపోవటమే గాక, మీటింగ్‌ల పేరు చెప్పి సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

'వంగపల్లి దీక్షను విజయవంతం చేయాలి'

కృష్ణ కాలనీ, జూలై 28 : టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్ష, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామేర గట్టయ్య పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ సెంటర్‌లో చలో ఢిల్లీ, వంగపల్లి దీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండ కడుతూ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల దేవరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్, జిల్లా కార్యదర్శి బచ్చల చిరంజీవి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్, మల్హర్ మండలాధ్యక్షుడు మంత్రి రాజబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మంగపేట, జూలై 28 : మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు టేకుమట్ల లక్ష్మి(80) మృతిచెందినట్లు ఎస్సై టీవీఎస్ సూరి తెలిపారు. లక్ష్మికి ఇద్దరు కొడుకులు కాగా, పెద్దకొడుకు నాగేశ్వర్‌రావు దేవనగరంలో, చిన్న కొడుకు నర్సయ్య కోమటిపల్లిలో ఉంటున్నారు. పెద్దకొడుకు ఇంటికి వెళ్లిన తల్లిని చిన్నకొడుకు వెళ్లి బైక్‌పై కోమటిపల్లికి తీసుకొస్తుండగా తిమ్మంపేట క్రాస్ రోడ్డు సమీపంలో బైక్ పైనుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు పలు చోట్ల గాయాలు కాగా, వెంటనే ఏటూరునాగారం సామాజిక దవాఖానకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. పెద్ద కొడుకు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేటి ప్రజావాణి రద్దు

భూపాలపల్లి రూరల్, జూలై 28 : బోనాల పండుగ సందర్భంగా సోమవారం సెలవు కావడంతో కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. విషయాన్ని గ్రహించి ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కార్యాలయాలకు రావొద్దని ఆయన సూచించారు.

'పద్మశాలీలను పట్టించుకోని ప్రభుత్వాలు'

కృష్ణ కాలనీ, జూలై 28 : ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లలో చేనేత కార్మికులు, పద్మశాలి కులస్తుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి నిధులు కేటాయించకుండా చిన్నచూపు చూశాయని తెలంగాణ చేనేత కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమనాథుని సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 16 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వెంటనే చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

'సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలి'

ఏటూరునాగారం, జూలై 28 : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ వెంటనే అమలు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రాథమిక కార్యకర్తలకు సర్వీస్ రూల్స్, పెన్షన్ రూల్స్‌పై ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోశాధికారి ఏవీ సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య పాల్గొన్నారు.

అటవీ గ్రామాల్లో ముమ్మర తనిఖీలు

ములుగు రూరల్, జూలై 28 : మావోయిస్టు అమరు వీరుల వారోత్సవాల సందర్భంగా అటవీ గ్రామాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు ముమ్మరం చేశారు. ములుగు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి సీఐ శంకర్ సర్వాపురం పరిధిలోని జగ్గన్నపేట సమీపంలోని బోడ రామయ్య గొత్తికోయ గుంపును సందర్శించారు. విప్లవ పార్టీలతో నష్టం తప్ప లాభం లేదని అన్నారు. కొత్త వ్యక్తులు గ్రామ పరిసరాల్లో కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కాగా, వరద నేపథ్యంలో సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న బొగ్గులవాగు లోలెవల్ వంతెన మీదుగా వాహనాలపై ప్రయాణం చేయవద్దని సీఐ సూచించారు. వరద కారణంగా వంతెన పైభాగంగా దెబ్బ తిన్నదన్నారు. సీఐ వెంట డీ58 సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఇనాంధర్, సిబ్బంది ఉన్నారు.

ఏటూరునాగారం మండలంలో..

ఏటూరునాగారం : జీడివాగు, అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. మండలంలోని లింగాపూర్ గొత్తికోయగూడెంలో తనిఖీలు చేపట్టారు. ఎస్సైలు తాజుద్దీన్, రమేశ్ పాల్గొన్నారు.

తాడ్వాయి మండలంలో..

తాడ్వాయి : మండలంలోని బయ్యక్కపేట సమీపంలోని సారలమ్మ గుంపు గొత్తికోయగూడాన్ని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. అలాగే, కాల్వపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వెంకటేశ్వర్లు, రమేశ్, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

గోవిందరావుపేట మండలంలో..

గోవిందరావుపేట : మండలంలోని పస్రా అటవీ సమీపంలోని పందిరిదోన గొత్తికోయగూడాన్ని పస్రా ఎస్సై ఏ కమలాకర్ సిబ్బందితో కలిసి సందర్శించారు. అలాగే, మండలంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు.

యాకన్నగూడెంలో..

వెంకటాపురం(నూగూరు) : మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామ శివారులో ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

కాటారంలో..

కాటారం : మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద, కాటారం వద్ద ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వివరాలు సేకరించారు.

ములుగురూరల్ : గొత్తికోయలతో మాట్లాడుతున్న ములుగు సీఐ, ఎస్సై, సీఆర్పీఎఫ్ సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోతున్న పూరిల్లు

గోవిందరావుపేట, జూలై 28 : మండలంలోని పస్రా మొద్దులగూడెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌కు గురై పూరిల్లు దగ్ధమైంది. దీంతో రూ.1.30లక్షల నగదుతో పాటు రెండు తులాల బంగారం బూడిది కాగా, కట్టుబట్టలతో బాధిత కు టుం బం రోడ్డున పడింది. మొద్దులగూడెం గ్రామానికి చెందిన పిట్టల నర్సయ్య ఇంటి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను శనివారం తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఇంటిలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయ త్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ములుగు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వా రు వచ్చే లోపే జరుగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో నగదు, బంగారం, టీవీ, కూలర్, ఇంటి సామగ్రి పూర్తిగా కాలిపోయి ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బాధతుడి భార్య పొలం పనికి వెళ్లింది. కాగా, బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.